సీరియల్ కథ

# విద్వేషి

రచన :
" ప్రవీణ్ సుశ్రీ "

(గత పంచిక తరువాయి)

పిల్లలంగనుక నీళ్ళల్లోకి ఎవరూదిగరాదని పంతులుగారు శాసించనే శాసించారు. గాని 'గిరి' 'మోహన్' నీలకంఠు...మధు...ఈజట్టుకు ఈతవచ్చు...వాళ్ళు ఎపుడూ స్కూలు ఎగగొట్టి లాకులకు కొంతదూరంలో ఈత కొట్టూవుండటం పరిపాటి.

అందుకనే ఎలాగైనా పంతులుగారి కళ్ళల్లో దుమ్ముకొట్టి వీలు చూచుకొని, ఈతకొట్టాలని వారి ప్లాను.

వీళ్ళప్లాను మన రాము విన్నాడు...రాముకి ఈత వచ్చు...గానీ...పంతులుగారు వెళ్ళవద్దన్నారు కాబట్టి వెళ్ళకూడదనుకున్నాడు.

గిరి వాళ్ళ ప్లానంతా పంతులుగార్కి చెప్తామని నిశ్చయించుకున్నాడు...గాని...ఎందుకో చెప్పలేక పోయాడు...కానీ గిరి వాళ్ళను గమనిస్తూనే వున్నాడు... పంతులుగారు అలసిపోయి కునుకు తీస్తున్నారు. రామును అర్జంటు పనిమీద మాష్టరుగారు వూళ్ళోకి పంపించారు ఇంకేం...ఇదే అదననుకున్నారు.

"గిరి," "మధు" నీలకంఠం "మోహన్" అందరి కళ్ళు కప్పి...తాము అనుకున్న చోటికి వెళ్ళారు. నీళ్ళల్లోకి దిగి ఈదడం ప్రారంభించారు ఆ నీళ్ళల్లోనే దొంగాట ఆడ్డం ప్రారంభించించారు.

వాళ్ళు దిగినచోటు అడుగున నాచుగూడా వుంది.

గిరి పొరపాటున అందరికంటే దూరంగా, ఎవరికి చిక్కకూడదని ఆ నాచువున్న వేపుకే వెళ్ళి నాచు కాళ్ళకు చుట్టుకొనడం వల్లన అక్కడి నుంచి కదల్లేక పోతున్నాడు. "ఓరేయ్...మోహన్...నీలకంఠం... నేను రాలేకపోతున్నానురా రండిరా!... నా కాళ్ళకు నాచు చుట్టుకుంది తియ్యండిరా" అని పెడబొబ్బలు పెట్టాడు.

అంతవరకు చక్కగా ఆడుకున్నవారు గిరి దగ్గరకు వెళ్ళడానికి ఎవరికీ ధైర్యంచాలలేదు...ఎవరూ వెళ్ళ లేదు.

అందరూ...ఒడ్డుకు చేరుకున్నారు గిరిని వదలిపెట్టి.

"గిరి" అక్కడ దాన్ని విడిపించుకోలేక సతమతమై పోతున్నాడు.

రాము వూళ్ళో పనిముగించుకుని ... అక్కడికి చేరుకునేప్పటికి... "గిరి" లేడు ... గిరి స్నేహితులు పంతుగారికి వచ్చి ఫిర్యాదు చేయడం, పిల్లలు పంతులు గారు ఆ స్థలానికి వెళ్ళడం జరిగింది...రాముగూడా పరుగెత్తుకుంటూ అటువెళ్ళాడు.

ఇంకేం, గిరి ఇంకా అక్కడే నాచుని విడిపించుకోలేక పోతున్నాడు పంతులుగారు ఒడ్డుమీద చిందులు వేస్తున్నారు.

ఎవరైనా దగ్గరలోకి సహాయానికి వస్తారేమోనని చూస్తున్నాడు.

రాము అక్కడికి చేరుకున్నాడు పరిస్థితి అవగాహన చేసుకున్నాడు...గిరికి రాముని చూడ్డంతోటే ప్రాణాలు లేచివచ్చాయి. "రామూ! రామూ!! నన్ను రక్షించరా!" అని పెడబొబ్బలు పెట్టాడు.

అంతే! రాము ముందూ వెనుకా ఆలోచించలేక... నీళ్ళలోకి దూకి వడిగా గిరివద్దకు చేరుకున్నాడు. అప్పటికి గిరి అలసిపోయాడు పూర్తిగా. అతిచాకచక్యంగా కాళ్ళకు చుట్టుకున్న నాచునంతా తాను తొలగించ్చాడు, గిరిని ఆ ప్రమాదం నుండి రక్షించాడు రాము, గొప్ప ప్రమాదము నుండి గిరిని రక్షించాడు కాబట్టి శంకరంగారికి రాము అంటే ప్రేమాభిమానాలు ఏర్పడ్డాయి.

ఇంట్లో లక్ష్మమ్మ సమస్త పనులు రాత్రింబవళ్ళు కష్టపడి పని చేయడం మూలంగా రాను, రాను, క్షీణించి పోతూంది. తన ఆరోగ్యంగురించి, రామూ భవిష్యత్తును గురించే ఆలోచన సాగించేది. అన్నిరోజులు ఒకలాగా వుంటాయా? ఒకరోజు లక్ష్మమ్మ నీళ్ళు తోడుతున్నదల్లా "అమ్మా" అంటూ హఠాత్తుగా పడిపోయింది. సమయానికి శంకరం ప్రక్కనున్నాడు. రాము, గిరి, ఆ సమయంలో ఇంట్లోలేరు...కాంతమ్మ, శంకరం లక్ష్మమ్మను ఇట్లోకి తీసుకవచ్చి, నిమిషాలమీద డాక్టర్ని పిలిపించారు

డాక్టరు పరీక్షించిన పిదప పెదవి విరిచాడు. అప్పటికే కొంచం లేటు పడంవలన లక్ష్మమ్మ ఆ పెదవి విరవడం అంతస్థితిలోను గమనించింది. పర్యవసానం తెలుసుకుంది. ఆమె గుండె చాలా బలహీనంగా వుందని. పరిస్థితి ఎప్పుడైనా విషమించ వచ్చుననీ, ఆస్పత్రిలో చేర్పించడం ఎందుకైనా మంచిదని డాక్టరు సలహాయిచ్చి వెళ్ళిపోయాడు. వెంటనే శంకరం ఆమెను ఆసుపత్రిలో చేర్పించాడు. వేరే పనిమనిషిని పెట్టాడు. రోజులు పెరుగుతున్నాయి అరోజులతో బాటే! లక్ష్మమ్మ గుండె జబ్బు గూడా పెరుగసాగింది.

అది ఒకరాత్రి లక్ష్మమ్మ పరిస్థితి విపరీతంగా తయారైంది. మరి అది ఒక ఆఖరి గడియే అవుతూందేమో! పిచ్చి! పిచ్చిగా "రామూ! రామూ"! అని ఇంకేమో కలవరిస్తుంది.

లక్ష్మమ్మ చాలా సీరియస్‌గా వుందని ఆస్పత్రి నుండి శంకరంగారికి కబురు వచ్చింది. వెంటనే బయలుదేరాడు. వచ్చేటప్పుడు రామును కూడా తనతో బాటు తీసుక వెళ్ధాం అనుకున్నాడు. గానీ... అది రాత్రి సమయం అయినా రాము వరండాలో ఓ చిలకి చాప మీద పడుకొని ఏవేవో కలవరిస్తున్నాడు.

అందుకనే రాముని లేపకుండానే ఆస్పత్రికి బయలుదేరాడు. శంకరం లక్ష్మమ్మ ప్రక్కగా వెళ్ళి కూర్చుని "లక్ష్మమ్మా!" అని పిలిచాడు. కళావిహీనంగా వున్న ఆమెముఖంలోకి చూశాడు. ఆమె కళ్ళల్లో జ్యోతి ఆరిపోతున్నట్లుగానే వుంది. ఆమె పెదాలు వణకుతున్నాయి.

మరలా పిలిచాడు "లక్ష్మమ్మ!" అని.

ఆమె మెల్లగా కళ్ళు తెరిచి చూచింది. చూచినంతనే ఒక శుష్కహాసం వెలువి తీసింది ఆ వణుకుతూన్న పెదాలు. కళ్ళల్లో అంతిమ గడియల్లో విలవిలలాడుతూన్న జ్యోతి దేదీప్యమానంగా ఒక్కసారి వెలిగింది. పెదాలు సుడిగాలిలో కారాకులా వణికిపోతున్నాయి. ఆ వణుకుతున్న పెదాలతోనే "బాబూ! వచ్చారా!" అంది.

ఆమె తల అటుఇటు త్రిప్పి చూచింది ఆశగా—

ఆమె ఆమాటల్లో ఎప్పటినుంచీ మీ కోసమే ఎదురు చూస్తున్నాను, అనే నిగూఢార్థాన్ని, ఆమె కళ్ళు ఎవరికోసం చూశాయో! ఆ చూపుల్లోని అర్థాన్ని శంకరం గ్రహించక పోలేదు.

"లక్ష్మమ్మా! వచ్చాను లక్ష్మమ్మా!" అన్నాడు శంకరం అంతకంటే ఏమి మాట్లాడాలో తెలియక.

"బాబూ! నా...రామూ! నా రాము ఏడి బాబూ! రాలేదా? బాబూ" చుట్టుకలియ జూస్తూ అంది.

"తేలేదు లక్ష్మమ్మ వాడు నిద్రబోతున్నాడు అందుకే తేలేదు."





మీరు తెలుసా? మీరు ధరించియున్నది

సి. టెక్స్

బనియన్లని?

లేనిచో, నేడే "సి. టెక్స్" బనియన్లను
కొని ధరించండి.

అవి :–చక్కని అల్లిక – సరైన కొలత,
దీర్ఘకాల మన్నిక, ధరించితే హాయి నిచ్చును.

: తయారించువారు :

Grams :-CEETEX Phone : 21290
**CHOWDAMBIKAI KNITTING CO.,**
KAMARAJ ROAD : : TIRUPUR - 638604

"బాబూ! నేను నా ఆశలన్నీ వాడిమీదే పెట్టుకున్నాను బాబూ! నా రాముకు అన్యాయం చేయరు కదూ? బాబూ నేను వాణ్ణి పెద్దచదువులు చదివించి గొప్పవాణ్ణి చేద్దామనుకున్నాను."

"బాబూ దిక్కులేని మమ్మ ఆదరించారు మీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను బాబూ నే నిక వెళ్ళిపోతున్నాను బాబూ!"

లక్ష్మమ్మ కళ్ళు ఆరిపోతున్నాయి. నాలుక పిడచ కట్టుపోయింది, గుటకలు మ్రింగుతూ చెప్పింది.

"భలేదానివి లక్ష్మమ్మా! ఈ మాత్రందానికి నీవిలా బెంగపడాలా? నీకిపుడేమైందనీ అలా బెంబేలు పడిపోతావ్? నీకేం భయం లేదు, నీవు త్వరలో కోలుకుంటావు." అన్నాడు లేని ఉత్సుకత తెచ్చుకుంటూ.

బయట హోరుగాలి వీస్తుంది. ఎక్కడో ఒక ఆగ్న దూరంగా అరుస్తూంది. దాని తర్వాత దూరంగా కుక్క ఏడుపు వినిపిస్తూంది. శంకరం ఒళ్ళు జలధరించింది. భయపడసాగాడు, ఒక ప్రక్క ధైర్యం చెప్తూనే.

"బాబుగారూ! వాడు నాలా ముష్టి ఎత్తుకో కూడదు బాబూ! ఇదే నా కోర్కె కానీ! కానీ నా కోర్కె తీరక ముందే నేను వెళ్ళిపోతున్నాను బాబూ!" బాబుగారూ! వాడికి తండ్రి బ్రతికి వున్నాడనే చెప్పాను బాబూ! మీరూ ఎపుడైనా అలాగే చెప్పండి బాబూ! లేకుంటే వాడు మరీ దిగులు పడిపోతాడు నా రామూ...ను...మీకు అప్ప జెప్పుతున్నాను బాబూ! అంటూ ఇంక ఏమీ, చెప్పలేక చేతులు జోడించింది. ఆ చేతులు వణుకుతూ క్రిందకు పడిపోయాయి. ఆమె చూపు మారిపోయింది.

రామూను వెంటనే తీసుక రమ్మని ఒకరిని ఇంటికి పంపించాడు. కాని ఇంతలో లక్ష్మమ్మ తల ప్రక్కకు వాలిపోయింది.

ఆమె ప్రాణం అనంత వాయువుల్లో లీనమయ్యింది. శంకరం వేడి కన్నీటి బొట్లు ఆమె చల్లని మృతశరీరంపై బడి చల్లబడినాయి అంతే! శంకరం ఘోరంగా లేచాడు.

◆ ◆ ◆

రామూ కిపుడు నా అనేవారు లేరు. ఏకాకి, అంతే ఎవరితోనూ సంతోషంగా మాట్లాడలేడు ఏదోబాధ తీరని ఆవేదన అతన్నిప్పుడు అంటిపెట్టుకుని వుంది. అది తల్లి లేని లోటేమో? అదేదిగులుతో ఎప్పుడూ ఆలోచనా చిత్తుడై పరధ్యానంలో పడుంటాడు. సరిగ్గా భోజనం చేయడు. అందుకే నానాటికీ చిక్కిపోతున్నాడు. శంకరం మాత్రం లక్ష్మమ్మకు ఇచ్చిన మాట ప్రకారం రామూను చదివిస్తూనే వున్నాడు.

గిరికి ఇక పట్టపగ్గాలులేవు. లక్ష్మమ్మ చనిపోవడం వలన ఒక పెద్ద అడ్డం తొలగిందనుకొని తనహృదయాన్ని పాషాణంగా చిత్రించుకొని రామూని చిత్రవధ చేయసాగాడు. తన పనులన్నీ రామూచేత చేయించుకునేవాడు. తన పి. ఎ. గా వాడుకుంటున్నాడు. వేలేపని మనిషివున్నా అడ్డమైన చాకిరిని రామూ చేతనే చేయించుకుని అందులో ఏదో సరిగ్గా చేయలేదని తిట్టడం, కొట్టడం ఈ విధంగా అతన్ని బాధిస్తుండేవాడు. గిరిదర్ ఇలా చేస్తున్నా రాము తనలోనే కుమిలిపోయేవాడే గాని ఎన్నడూ శంకరంతో చెప్పేవాడు కాదు, లక్ష్మమ్మ ఓర్పు సహనం మొదలగు మంచిగుణాలన్నీ రాములో మూర్తీభవించాయి కాబట్టే అంత చిన్నవాడైనా గిరి బాధలకు ఓర్చుకో గల్గుతున్నాడు, తట్టుకో గల్గుతున్నాడు. "తాము ఎంత బాధపడుతున్నా ఫరవాలేదు గాని తమవల్ల ఇతరులు బాధపడ్డం కొందరికి ఇష్టం వుండదు అందుకే తాముపడే బాధలను ఇతరులకు సైతం అగుపడనీయరు వీరి జీవితాలు తాము కాలుతూ, కరిగి, కృశించిపోతూ! నశించిపోతూ! ఇతరులకు వెలుగును ప్రసాదించే క్రొవ్వొత్తిలాంటివి. వీరు మహాపురుషులు" ఇటువంటి వారీలోకంలో మహా అరుదుగా అగుపిస్తుంటారు ఈ కోవకు చెందినవారే తల్లీ, కొడుకులూను.

గిరి తన్ను పెట్టున్న బాధలన్నింటినీ ప్రతిరోజూ రాత్రి అందరూ నిద్రపోయిన తర్వాత తన తల్లితో చెప్పుకుని, ఆ చీకటిలో తనలో తాను కుమిలిపోయే వాడు.

అయినా చదువులో మాత్రం అశ్రద్ధచూపే వాడు కాదు చక్కగా చదువుకొనే వాడు. పరీక్షల్లో గిరి కంటె రామూకు ఎక్కువ మార్కులు రావడంతో శంకరం గిరిని కోపంతో బాగాతిట్టి "చూడరా! శ్రద్ధ అంటే అలావుండాలిరా! తల్లిదండ్రులు లేకపోయినా, చదువుకునే అవకాశం లేకపోయినా చూడరా! రాము ఎంత మంచి మార్కులతో పాస్ అవుతున్నాడో. ఎప్పుడైనా అటువంటివాళ్ళేరా పైకివచ్చేది నీ బోటి వాళ్ళు ఎందుకూ పనికిరారు! గొడ్డుగాయడాన్ని దప్పు, విగ్గ

లేదట్రా! వాడికంటే పెద్దవాడివి ఛీ!" అని తిట్టడం ప్రారంభించాడు.

అంతేకాదు ఒక్కోసారి మరీ కోపం వచ్చినపుడు బెత్తంతో వాతలుపడేలా కొట్టేవాడుగూడా. అటువంటి సమయంలో ఎక్కడ్నించో కాంతమ్మ వూడిపడి అడ్డుపడుతూండేది.

"నా బాబూ మీద ఇంతవరకు ఈగ వాలకుండా పెంచాను. ఈ నాటికి ఆ రాముగాడివల్ల దెబ్బలు తినాల్సి వచ్చింది."

అంటూ తిట్టుకుంటూ డేది. శంకరంకి గిరి విషయం పెద్ద తలనొప్పిగా పరిణమించింది. మిత్రుడు విశ్వనాథంతో చెప్పుకొనేవాడు, కాస్తభారం తగ్గడానికి.

కాని గిరికి రామూ విషయం పెద్దతల నొప్పిగా తయారైంది. తనగదిలో కూర్చుని ఆలోచించ సాగాడు. "ఈ రాముగాడి వల్లనేగదా మానాన్న నన్నుతిడుతుంది, కొట్టుంది. వీడుకూడ ఇంట్లోనే గాదు వీధిలో గూడా నాకు పెద్ద ఆటంకంగా తయారైయ్యాడు.

నాకిపుడు వీడొక బాడీగార్డులాగా తయారైయ్యాడు.

ఇదివరకు నేను బడి ఎగగొట్టి లాకులదగ్గరకు వెళ్ళి ఈతకొట్టేవాడిని, తోటలోకి వెళ్ళి కోతికొమ్మచ్చి ఆడుకునే వాళ్ళం, సిగరెట్లు, బీడీలు కాల్చేవాళ్ళం ఇపుడు ఏపనిచేయాలన్నా చాలా కష్టంగా వుంది, పైగా బడికి తప్పకుండా వెళ్ళాల్సి వస్తుంది. మా నాన్న వీడంటే పడిచస్తున్నాడు. సొంతకొడుకైన నన్నేమో, చీదరించుకుంటున్నాడు చీపురుపుల్లకంటే హీనంగా చూస్తున్నాడు. పైగా చావచితక బాదుతున్నాడు వీడిని నా మీద బాడీగార్డుగా పెట్టాడు ఛీ! ఛీ! ఎంతవమానం? ఎంతవమానం? వీడు నాయింట్లో వుండి నన్నే కొట్టిస్తాడా? వీడసలెవాడసలు నాయింట్లో లేకుంటే? అసలు నన్ను కొట్టేవాడా? అసలు ఈ ముష్టివెధవ, ఈ దరిద్రగొట్టు వెధవ మా యింట్లో ఎందుకుండాలి? వుండడానిక్కీ వీలులేదు ఇంకా ఇలానే చూస్తూ వూరుకుంటే! మా నాన్న వీడ్ని తన కొడుకుగా చేసుకుని నన్ను ఇంట్లోంచి తన్ని తరిమేట్టుగా వున్నాడు. మానాన్న వీడ్ని ప్రేమించడమా? నన్ను ద్వేషించడమా? హు! ఒరేయ్! గిరీ! నీకన్ని తిప్పలువచ్చి పడ్డాయిరా! హు! వీటికంతటికీ! ప్రతీకారం చేసితీరాలి, వీడిని ఎలాగైనా ఇంటినుండి వెళ్ళగొట్టాలి, అంతవరకూ నేను నిద్రపోను! అంతవరకూ నాకు మనశ్శాంతి లేదు ఎలా? ఎలా? ఈ ఆలోచనలతో గిరితల గిర గిరమని తిరిగిపోతూంది.

ఈ సమస్య తీరాలంటే! తన మిత్రమండలిని కలుసుకోవాలి! అది ఆదివారం అవడంవల్ల వాళ్ళు తప్పక ఇక్కడికే వస్తారని వారికొరకై ఎదురు చూడసాగాడు.

◆ ◆ ◆

ఇంతలో నీలకంఠం, మోహన్, మధు అందరూ రానే వచ్చారు. వస్తూనే! నీలకంఠం గిరిని నఖశిఖ పర్యంతం వీక్షించి, ఏదో నూతనత్వాన్ని తిలకించాడు.

"ఏరోయ్! ఏమిటీ! అలాగున్నావ్ లంఖణాలేమన్నా నా?" అన్నాడు, సమాధానం లేదు.

"ఆదివారం మౌన వ్రతం ఏ మన్నానా?" అన్నాడు మోహన్. కాదన్నట్లుగ అటుఇటు తల త్రిప్పాడు గిరి.

(సశేషం)

★

# సోమరిపోతు సోమయ్య

★

అనగనగా ఒక ఊరుంది
ఆ ఊరిలో సోమయ్యున్నాడు
పేరుకు తగిన విధముగనే
పెరుగసాగెను సోమయ్య
సోమరిపోతు సోమయ్య.

ఎవ్వరు చెప్పిన వినడయ్యా
మూడు పూటలు తింటాడు
ముద్దుగ నిద్దుర పోతాడు
చదువంటే ఏడుస్తాడు
పని జెపితే అసలేవినడు.

పనిలో మొద్దు
చదువులో మొద్దు
సోమరిపోతు ఎవరికి ముద్దు
చలో చలో సోమయ్యను గుద్దు.

—ఎర్రోజు సత్యం.